


పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# టి.వి.ఎస్.శర్మ

# ఆర్టు డైరెక్టరు

## (తెలుగు సినిమా 1948, ఏప్రిల్ సంచిక నుంచీ)



ఒక చిత్రం విజయవంతమయిందంటే దానికి కారకులు ఒక్క నటీ నటకులు మాత్రమేకారు. మీరు తెరపైన చూడని టెక్నీషియన్ల శ్రమ ఎంతో వుంటేగాని చిత్రం విజయవంతమవటానికి వీలు లేదు. మద్రాసు చిత్ర పరిశ్రమలో వున్న ముఖ్య ఆర్టు డైరక్టర్లలో శ్రీ టి.వి.యస్.శర్మ గారు ఒకరు. వీరిని పాఠకులకి పరిచయం చేస్తున్నాము. ప్రతి సంచికలోనూ ఒక టెక్నీషియన్ ని పాఠకులకి పరిచయం చేస్తాము. సం!!

★ ★ ★

1909 సం||లో నెల్లూరు జిల్లా పొదిన తాలూకాలోనున్న తంగిరాల సుబ్బయ్య అనే గ్రామ మునసబుకి జన్మించాడు. టి.వి.యస్.శర్మ. శర్మకి ఎనిమిదేళ్ళ వయస్సు వున్నపుడు, స్నేహితులతో ఆడుకుంటూండగా, రాళ్ళు పగలగొట్టటానికి కూర్చబడిన మందుగుండు పేలటం, తత్ఫలితంగా ఆడుకుంటున్న కుర్రాళ్ళకి గాయాలు తగలటం శర్మ ఎడంచేయికి దెబ్బ తగలటం జరిగాయి. డాక్టర్ల సలహా ప్రకారం శర్మ ఎడం చేయిని ఏంపుట్యువేట్ చేశారు. ఆనాటినుంచీ శర్మ వంటిచేయి వాడయ్యాడు.

అసలే బీదవాడు అయిన శర్మ తండ్రికి వుద్యోగం పోవటంవల్ల నిలువ నీడలేక నెల్లూరు చేరుకున్నారు. అప్పుడు శర్మకి తొమ్మిదేళ్ళు. నెల్లూరులో ఒక సత్రంలో నివసిస్తూండేవారు. శర్మకి ముగ్గురు తమ్ముళ్ళు, ఒక చెల్లెలు. ఉద్యోగం లభించక; యింత సంసారాన్ని మోయలేక శర్మతండ్రి బ్రాహ్మణీకం

ప్రారంభించాడు. అదే సత్రంలో 10 సంవత్సరాలు గడిపారు. శర్మ చదువుకుంటూండేవాడు. నెల్లూరులో పెద్ద గాలివాన వచ్చింది. శర్మకి దాదాపు 19 సంవత్సరాలు. ఆ గాలివానలో శర్మ తండ్రి మరణించాడు.

తండ్రిని పోగొట్టుకున్న శర్మలో విరక్తి ఏదో భయం మళ్ళీ కొంత మొండిధైర్యం రగుల్కున్నాయి. ఆనాటినుంచీ ప్రారంభించాడు శర్మ జీవితంతో హోరాహోరీగా యుద్ధం.

దేశ సంచారం బయలుదేరాడు. ఆగ్రా, నాసిక్_హైద్రాబాదు మొదలయిన వూళ్ళు తిరిగి తిరిగి చివ్వరికి విజయనగరం చేరుకున్నాడు. డబ్బులేని శర్మ ఈ వూళ్ళన్నీ ఎలా తిరిగాడు! ఈ ప్రశ్నకు సమాధానం మీ వూహాతీతం కాదు. విజయనగరంలో కట్టు సూర్యనారాయణ శాస్త్రి గారి దగ్గర సంగీతం నేర్చుకోవటం ప్రారంభించాడు. దాదాపు ఒకటిన్నర సంవత్సరం విజయనగరంలోనే వుండి, యువకుడూ చంచల మనస్కుడూ అయిన శర్మ హైద్రాబాదు చేరుకున్నాడు. హైద్రాబాదు లో హుసేన్ బక్ష్ ప్రముఖ చిత్రకారుడు దగ్గిర చిత్రకళ నేర్చుకొనటం ప్రారంభించాడు. కొంతకాలం హైద్రాబాదులో గడిపి అక్కణ్ణుంచి బందర్ చేరుకున్నాడు. డబ్బులేని, వుద్యోగంలేని శర్మ ఈ సంచారం ఎలా సాగించాడు ? ఈ వూళ్ళల్లో ఎలా జీవించాడు బ్రతకాలనే యిచ్ఛవున్న ప్రతివ్యక్తీ ఏవో కొన్ని మార్గాలు వెదుక్కుంటాడు.

శ్రీ ఈరంకి వెంకటశాస్త్రి గారి అభిమానాన్ని సంపాదించుకుని, ఆంధ్రజాతీయ కళాశాలలో ప్రవేశించాడు శర్మ. ముట్నూరి కృష్ణారావు, చెరుకువాడ లక్ష్మీనరసింహరావు, మన్నవ రాజగోపాల కృష్ణయ్య, ధనస్సు సూర్యనారాయాణరావు శాస్త్రి, వారణాసి సదాశివపంతులు మరికొందరి పెద్దమనుష్యుల ఆదరాన్ని సంపాదించుకుని వారాలు చేసుకుంటూ చిత్రలేఖనం నేర్చుకుంటూండేవాడు. నవ్వులరాణి, నవ్వులతోట అనే రెండు తెలుగు పత్రికలకి బొమ్మలు గీస్తూ కొంత సంపాదించుకునే వాడు.

ఒక హిందీ నాటకంలో అలెగ్జాండర్ పాత్ర ధరిస్తూండేవాడు కూడా. ఆంధ్రజాతీయ కళాశాల గురించి ఒక ముక్క చెప్పాలి. ఆంధ్రదేశంలో పేరుపడ్డ చిత్రకారులయిన కౌతా రామ్మోహన్, అడివి బాపిరాజు, మాధవపెద్ది గోఖలే, చలనచిత్ర పరిశ్రమలో పేరుపడ్డ చిత్రకళా దర్శకులు ఎస్.వి.ఎస్. రామారావు, శర్మ, ఎస్.ఎస్.బ్రహ్మ కూడా ఆంధ్ర జాతీయాకళాశాల నుంచి వచ్చిన వారే. బరోడా సంస్థాన చిత్ర కారుడు శంకరరామనాధన్ కూడా ఈ కళాశాలనుంచి వచ్చిన వాడే. శర్మ సహోధ్యాయి అయిన డైరెక్టర్ సి.పుల్లయ్య ప్రప్రధమంగా శర్మని మద్రాసు పిలిపించి స్టార్ పబ్లిసిటీ అనే ఒక అడ్వర్టయిజింగు కంపెనీలో ప్రవేశ పెట్టాడు. ఆనాటినుంచీ శర్మకి చలనచిత్ర పరిశ్రమతో సంబంధం ఏర్పడింది. ఈ పబ్లిసిటీ కంపెనీ, స్టార్ కంబైన్స్ అనే సినిమా కంపెనీగా మారటం కొల్హాపూరులో హరిశ్చంద్ర తీయటం, శర్మకూడా వెళ్ళి ఆర్టు డైరెక్షన్ నేర్చుకొనటం సంభవించాయి. కొంతకాలం అసిస్టెంటుగా పనిచేసి, తర్వాత తర్వాత స్వంతంగా ఆర్టుడైరెక్షన్ నిర్వహించాడు. శర్మ ఆర్టు డైరెక్షన్ యీ చిత్రాలలో మనం చూశాం. హరిశ్చంద్ర, సతీతులసి, మార్కండేయ, బాలాజీ, మైరావణ, భూకైలాస్, విశ్వమోహిని, పార్వతీకళ్యాణం, కృష్ణప్రేమ, గరుడగర్వభంగం, సీతారామజననం, సత్యభామ, భీష్మ, గొల్లభామ, ఎక్సుక్యూజ్ మీ, అరవ అశోక కుమార్, ఋష్యశృంగం, ధన, అమరావతి, పారిజాతం, కంకణం, ద్రోహి.

తారల జీవితాలకీ టెక్నీషియన్ల జీవితాలకి వున్న వ్యత్యాసం పాఠకులకి గోచరిస్తుందని విశ్వసిస్తున్నాను. తృటికాలంలో తారాజువ్వ మల్లే ఆకాశాన్ని అందుకోలేడు టెక్నీషియన్, కష్టపడి ఒక్కొక్క అడుగే వేస్తూ జీవితాన్ని, భవిష్యత్తుని నిర్మించుకుంటాడు టెక్నీషియన్. శోభనాచల స్టూడియో ఆర్టుడైరెక్టరుగా పనిచేస్తూ, పెద్ద జీతం సుమారు రూ.1000 యీనాడు సంపాదిస్తున్న శర్మ యీ స్థితికి చేరుకొవటానికి ఎంతకాలం ఎంత శ్రమ అవసరమైందో ఆలోచించండి.

★★★

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS